సాక్షి నంద్యాల

బుధవారం ၊ 10 ၊ ఏప్రిల్ ၊ 2024



అలరించిన సంగీత విభావరి

శ్రీశైలంటెంపుల్: ఉగాది సందర్భంగా మంగళవారం తెనాలికి చెందిన ఎన్.వరలక్ష్మికల్యాణి, బెంగళూరుకు చెందిన పి.సుధాకర్, బృందం సంగీత విభావరి అలరించాయి.



ఎస్పీ పర్యవేక్షణ

శ్రీశైలం: రథోత్సవం అనంతరం కన్నడ భక్తులు తిరుగు ప్రయాణంలో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కోకుండా జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి స్వయంగా పర్యవేక్షించారు.



మయూరం.. విహారం

డోన్: ఓ నెమలి ఇటీవల డోన్ పట్టణంలోకి వచ్చి స్వేచ్ఛగా విహరిస్తోంది. డాక్టర్ పోచా నగర్, వైఎస్ నగర్ ప్రాంతాల స్థానికులు అందించే పండ్లు, నీరు తీసుకుంటూ ఇక్కడే సంచరిస్తోంది.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:36	ఉ॥ 4:40
ఆదోని	సా॥ 6:39	ఉ॥ 4:43
నంద్యాల	సా॥ 6:36	ఉ॥ 4:37
ఆత్మకూరు	సా॥ 6:34	ఉ॥ 4:38
బనగానపల్లె	సా॥ 6:37	ఉ॥ 4:38

హదీస్ వెలుగు :

పవిత్ర రంజాన్ మాసం ముగిసినప్పటికీ ఎలాంటి పుణ్యకార్యం చేయని, ముక్తి పొందని వ్యక్తి మనలో లేడు.

– పవిత్ర ఖురాన్



సాత్వికబలి సమర్పిస్తున్న ఈఓ, అధికారులు



ఉత్సవమూర్తులను పల్లకీలో తీసుకొస్తున్న ఈఓ, జగద్గురు పీఠాధిపతి



ఉత్సవంలో కళాకారుల ప్రదర్శన

మనోహరం



భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఉత్సవమూర్తులు

- కనుల పండువగా మల్లన్న రథోత్సవం
- స్వామిఅమ్మవార్ల దర్శనంతో పులకించిన కన్నడిగులు
- రాజరాజేశ్వరి అలంకారంలో భ్రమరాంబాదేవి కటాక్షం
- ఉగాది మహోత్సవాలకు నేడు పూర్ణాహుతి



అశేష భక్త జనవాహిని మధ్య శ్రీశైల మల్లన్న రథోత్సవం

భ్రామరీ సమేత మల్లికార్జునుడు రథంలో విహరిస్తుండగా భక్త కోటి ఆధ్యాత్మిక తన్మయత్వంలో ఓలలాడింది. సిరిగిరి మల్లయ్య.. మహాత్మ మల్లయ్య.. నినాదాలు హోరెత్తాయి. శ్రీగిరిలో మల్లన్న వైభవాన్ని కన్నడ భక్తులు కనులారా చూసి తరించారు. ఉగాది పర్వదినాన శ్రీశైల క్షేత్రంలో మంగళవారం సాయంత్రం మల్లన్న రథోత్సవం అశేష భక్తజనం మధ్య కనులపండువగా సాగింది. కోరిన కోర్కెలు తీర్చే రమావాణీ సేవిత రాజరాజేశ్వరీ అలంకారంలోని భ్రమరాంబ అమ్మవారిని దర్శించుకున్నారు.

శ్రీశైలంటెంపుల్: సమస్త జనులకు భూ కైలాసంగా, భూమండలానికి నాభిస్థానంగా పిలువబడుతున్న శ్రీశైల మహాక్షేత్రంలో ఉగాది మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో నాల్గవ రోజు మంగళవారం స్వామిఅమ్మవార్లకు రథోత్సవం నేత్రానందభరితంగా సాగింది. ముందుగా ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామిఅమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో ఉంచి ఊరేగింపుగా రథశాల వద్దకు తోడ్కొని వచ్చి రథంపై ఉంచారు. అనంతరం స్థానాచార్యులు రథాంగ పూజ, రథాంగ హోమం, రథాంగ బలి నిర్వహించారు. అర్చకులు ఉత్సవమూర్తులకు ప్రత్యేక హారతులిచ్చారు. అనంతరం దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు, అధికారులు రథానికి కూష్మాండ బలి సమర్పించారు. అనంతరం రథానికి ప్రత్యేక హారతి ఇచ్చి రథోత్సవాన్ని ప్రారంభించారు. ఉత్సవంలో లక్షలాది మంది కన్నడ భక్తులు పాల్గొని స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. ఉత్సవ శోభతో వెలుగొందుతున్న మల్లన్నను దర్శించుకుని పులకించిపోయారు. సిరిగిరి మల్లయ్య.. మహాత్మ మల్లయ్య..అని కన్నడ భక్తులు కొనియాడుతూ ఓంకారనాద ధ్వనుల మధ్య భక్తిపూర్వకంగా రథంపైకి అరటిపండ్లు, ఖర్జూరాలు, కలకండ విసిరి భక్తిని చాటుకున్నారు. గంగాధర మండపం నుంచి నంది మండపం వరకు రథోత్సవాన్ని నిర్వహించారు. కర్ణాటక జాంజ్, వీరగాసీ, కన్నడ జానపద డోలు, కోలాటం, చెక్కభజన ప్రదర్శన, బుట్టబొమ్మలు, గొరవయ్యల నృత్యం, తప్పెట్లు, కొమ్ము వాయిద్యాలు, నందికోలు నృత్యాలు గ్రామోత్సవానికి మరింత వన్నెను తీసుకువచ్చాయి. రథోత్సవ దర్శనం వలన సర్వపాపాలు తొలగిపోతాయని, కోరిన కోర్కెలు నెరవేరుతాయని చెప్పబడుతుంది.



రమావాణిసేవిత రాజరాజేశ్వరి అలంకారంలో శ్రీశైల భ్రమరాంబాదేవి

ఈ ఏడాది పారిశ్రామిక రంగంలో అభివృద్ధి



పంచాంగ శ్రవణం చేస్తున్న ఆస్థాన సిద్ధాంతి పండిత బుట్టే దైవజ్ఞ

ఈ ఏడాది దేశం పారిశ్రామికరంగంలో అభివృద్ధి చెందుతుందని శ్రీశైలం దేవస్థాన ఆస్థాన సిద్ధాంతి పండిత బుట్టే దైవజ్ఞ తెలిపారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం ఆలయ ప్రాంగణంలోని స్వామిఅమ్మవార్ల నిత్యకల్యాణ మండపంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, దేవస్థానం ఈఓ డి.పెద్దిరాజు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజమండ్రికి చెందిన పండిత బుట్టే దైవజ్ఞ పంచాంగ శ్రవణం చేయించారు. ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ స్వామిఅమ్మవార్ల కల్యాణ మూర్తులకు విశేష పూజలు జరిపించారు. అనంతరం ఆస్థాన సిద్ధాంతి క్రోధినామ సంవత్సర విశేషాలను వివరించారు. ఈ సంవత్సరం దేశమంతటా సగటు వర్షపాతం నమోదవుతుందన్నారు. ఉత్తరాదిలో నదులు పొంగిప్రవహిస్తాయన్నారు. దేశంలో ఆహారధాన్యాల నిల్వలు సమృద్ధిగా ఉంటాయన్నారు. పల్లపు భూములు విశేషంగా పండుతాయన్నారు. మిర్చి, పత్తి, పొగాకు, ఎరుపు ధాన్యాలకు మంచి దిగుబడి ఉంటుందన్నారు. నూనె గింజల ఉత్పత్తులు పెరుగుతాయన్నారు. ఈ సంవత్సరం క్రీడారంగం కూడా బాగుంటుందన్నారు.

రమావాణీసేవిత రాజరాజేశ్వరీ నమోస్తుతే..

ఉగాది మహోత్సవాల్లో భాగంగా నాల్గవరోజు అమ్మవారి ఉత్సవమూర్తిని రమావాణీ సేవిత రాజరాజేశ్వరీ అలంకారంలో ప్రత్యేకంగా అలంకరించారు. అలంకారమూర్తికి విశేషపూజలు నిర్వహించారు. చతుర్భుజాలు కలిగిన ఈ దేవి పాశం, అంకుశం, పద్మం, చెరకుగడను ధరించి దర్శనం ఇచ్చారు. ఈ దేవిని దర్శించడం వలన కోరిన కోర్కెలు నెరవేరుతాయని, సమస్యలన్నీ తొలగిపోతాయని చెప్పబడుతుంది.

నేడు ఉత్సవాలకు పూర్ణాహుతి

ఈనెల 6వ తేదీ నుంచి ప్రారంభమైన ఉగాది మహోత్సవాలకు బుధవారం పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అమ్మవారికి భ్రమరాంబాదేవి నిజాలంకరణ, స్వామిఅమ్మవార్లకు అశ్వవాహనసేవ, ఆలయ ఉత్సవాన్ని నిర్వహిస్తారు. దీంతో ఉగాది మహోత్సవాలు ముగుస్తాయి.

న్యూస్‌రీల్

11న నంద్యాల డయాసిస్ బిషప్ ఎన్నిక

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల డయాసిస్ అధ్యక్ష ఖండానికి ఈ నెల 11వ తేదీన పీఠాధిపతి (బిషప్) ఎన్నిక నిర్వహిస్తున్నట్లు లేస్ కమిటీ చైర్మన్ సాల్మన్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గురువారం ఉదయం 8 గంటలకు హోలీక్రాస్ క్యాథడ్రల్ (పెద్ద చర్చి) ఆలయంలో ఆరాధన కార్యక్రమం నిర్వహించిన అనంతరం ఎన్నిక ప్రారంభమవుతుందన్నారు. ఈ ఎన్నికలో 313 మంది పాస్టర్లు, కౌన్సిల్ మెంబర్లు, బిషప్ నామినేషన్ సభ్యులు, ఎక్స్ అఫీషియో సభ్యులు తమ ఓటు హక్కు వినియోగించుకుంటారన్నారు. నంద్యాల బిషప్ బరిలో రెవరెండ్‌లు అబ్రహం ప్రేమ్ చెంద్ జే, ఆర్థర్ ఇమ్మానియేల్, ఐజిక్ కే, ఐజిక్ నందం, ఐజిక్ ప్రసన్న కుమార్ టీఎస్, జోనాథన్ సునీల్ కుమార్ బిల్లా, జోసెఫ్ కొత్తమాసి, సంతోష్ ప్రసాదరావు, సాల్మన్ బరిలో ఉన్నట్లు తెలిపారు. నంద్యాల డయాసిస్ ఇన్‌చార్జ్ బిషప్ రైట్ రెవరెండ్ ఐజిక్ వరప్రసాద్ పర్యవేక్షణలో జరుగుతాయన్నారు. ఎన్నికల సందర్భంగా 3వ పట్టణ సీఐ, ఎస్‌ఐలతో పాటు పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

ముగిసిన పది మూల్యాంకనం

నంద్యాల(న్యూటౌన్): పదవ తరగతి పరీక్షల సమాధాన పత్రాల మూల్యాంకనం ముగిసింది. ఈనెల 1వ తేదీ నుంచి నంద్యాల శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రారంభమైన మూల్యాంకనానికి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి వచ్చిన తెలుగు, హిందీ, ఇంగ్లిష్, మ్యాథ్స్, ఫిజికల్ సైన్స్, బయాలజికల్ సైన్స్, సోషల్ స్టడీస్ 1,91,422 సమాధాన పత్రాలను ఆయా సబ్జెక్టు నిష్ణాతులు వ్యాల్యుయేషన్ చేశారు. సమాధాన పత్రాలను 120 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 718 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 195 మంది ప్రత్యేక సహాయకులు మొత్తం 1,033 మంది సిబ్బంది మూల్యాంకనం చేశారు. ఈనెల 8వ తేదీ వరకు మూల్యాంకనాన్ని నిర్వహించి పూర్తి చేశారు. ఈ కార్యక్రమాన్ని క్యాంప్ ఆఫీసర్, డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్, ప్రభుత్వ పరీక్ష అసిస్టెంట్ కమిషనర్‌తో పాటు సిబ్బంది పర్యవేక్షించారు. ఫలితాలను త్వరలో విడుదల చేసేందుకు రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

తగ్గిన వడగాడ్పులు

కర్నూలు(అగ్రికల్చర్):బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి కారణంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో వాన చినుకు దాఖలాలు లేకపోయినప్పటికీ ఎండలు, వడగాడ్పుల తీవ్రత తగ్గింది. సోమవారం సాయంత్రం నుంచే శీతల గాలులు వీస్తున్నాయి. వేడి గాలుల తీవ్రత తగ్గినప్పటికీ ఉమ్మడి కర్నూలు జిల్లాలోనే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధికంగా మంత్రాలయంలో 41.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా చాగలమర్రిలో 40.6, కౌతాళంలో 40.3, గడివేములలో 40.2, బనగానపల్లె, డోన్, నందికొట్కూరు, గోస్పాడు మండలాల్లో 40.1, చిప్పగిరిలో 36.7 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

అమ్మవారికి కొబ్బరికాయల సమర్పణ



అమ్మవారికి కొబ్బరికాయలు సమర్పిస్తున్న దేవస్థాన ఈఓ, ఆలయ సిబ్బంది, పర్యవేక్షకులు

శ్రీశైలంటెంపుల్: చైత్రమాసంలో పౌర్ణమి తరువాత వచ్చే మంగళ, శుక్రవారం రోజున ఏ రోజు ముందు వస్తే ఆ రోజు శ్రీభ్రమరాంబాదేవి అమ్మవారికి కుంభోత్సవం జరపడం సంప్రదాయం. ఈ ఏడాది ఈ నెల 26న అమ్మవారికి కుంభోత్సవం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా మంగళవారం అమ్మవారికి కొబ్బరికాయలు సమర్పించారు. కార్యక్రమంలో ముందుగా అమ్మవారి ఆలయ ప్రదక్షిణ మండపంలో కొబ్బరికాయలను రాశిగా పోసి పసుపు, కుంకుమలతో వాటికి పూజాదికాలు జరిపించారు. అనంతరం అమ్మవారికి కొబ్బరికాయలు సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి, స్వామివారి ఆలయ ఏఈవో హరిదాసు, పర్యవేక్షకులు వెంకటేశ్వరరావు, సీఏ ప్రసాదరావు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ఉగాది వేడుకలు



పంచాంగ శ్రవణం చేస్తున్న అహోబిలం మఠం పీఠాధిపతి

ఆళ్లగడ్డ: తెలుగువారి తొలి పండుగ క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ ఏడాది అంతా మంచే జరగాలని కోరుకుంటూ భక్తులు పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రముఖ పుణ్య క్షేత్రం అహోబిలంలో ఉగాది పర్వదిన వేడుకలు వైభవంగా నిర్వహించారు. పీఠాధిపతి శ్రీ రంగనాథ యతీంద్ర మహాదేశికన్ ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరదస్వాములను కొలువుంచి పంచామృతాలతో అభిషేకించి నవకళశ స్థాపన చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పంచాగ శ్రవణం ప్రారంభించారు.

వన్యప్రాణుల దాహార్తి తీరేలా..

- 25 ట్యాంకర్లతో నల్లమలలో సాసర్‌పిట్లకు నీటి సరఫరా
- 200 మంది సిబ్బందితో అటవీ శాఖ ప్రత్యేక ఏర్పాట్లు
- 110 సోలార్ బోర్లు ఏర్పాటు



కుంటలను ట్యాంకర్లతో నింపుతున్న అటవీ సిబ్బంది



నల్లమల అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన కుంటలలో నీటిని తాగుతున్న జింకలు

నంద్యాల(సిటీ): మండే ఎండలతో జనం విలవిలలాడుతున్నారు. అడవిలో వన్యప్రాణులది అదే పరిస్థితి. వర్షాభావ పరిస్థితులలో నల్లమల అటవీ ప్రాంతంలో నీటి నిల్వలు తగ్గడంతో వన్యప్రాణులు నీటి జాడ కోసం అరణ్యాన్ని వీడి జనావాసంలోకి వస్తున్నాయి. దీంతో వాటి ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోంది. అయితే అటవీశాఖ అధికారులు వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. నాగార్జున సాగర్ శ్రీశైలం టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉన్న ఆత్మకూరు, నంద్యాల, గిద్దలూరు, మార్కాపురం నల్లమల డివిజన్ల పరిధిలో 23 రేంజ్‌లు ఉన్నాయి. ఆయా రేంజ్‌ల పరిధిలో విలువైన అటవీ సంపదను నిరంతరం కాపాడుతుంటంతో పాటు అరుదైన వన్యప్రాణులకు రక్షణగా అటవీ సిబ్బంది గస్తీ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో మండు వేసవిలో నల్లమలలో నీటి నిల్వలు అడుగంటడంతో దాదాపు 200 మంది సిబ్బందితో అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే అడవిలో వన్యప్రాణులు సంచరించే ప్రాంతాలను గుర్తించి 150 సాసర్‌పిట్లు (నీటి కుంటలు) ఏర్పాటు చేశారు. నంద్యాల డివిజన్ పరిధిలోని బండిఆత్మకూరు, చెలిమ, రుద్రవరం రేంజ్ పరిధిల ప్రతి రోజూ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. దాదాపు 110 సోలార్ బోర్లు ఏర్పాటు చేసి నీటిని నిత్యం అందుబాటులో ఉంచుతున్నారు. నల్లమల అభయారణ్యం పరిసర ప్రాంతంలో వన్యప్రాణుల దాహార్తిని తీర్చడానికి సాసర్‌పిట్లకు అదనంగా మరో 100కు పైగా ప్రాంతాల్లో తొట్లను ఏర్పాటు చేశారు. మరో 50 ప్రాంతాల్లో చెలమలను తవ్వి వన్యప్రాణులకు నీటి సౌకర్యాన్ని పెంపొందిస్తున్నారు. అదేవిధంగా 100కు పైగా చెక్ డ్యామ్స్ ఏర్పాటు చేసి వాటి వద్ద నీటి నిల్వలను ఏర్పాటు చేస్తున్నారు. నీటి తొట్లల్లో ప్రతి మూడు, నాలుగురోజులకు ఒకసారి ట్యాంకర్ల ద్వారా బేస్ క్యాంపు సిబ్బంది, బీట్ ఆఫీసర్లు నీటిని నింపుతున్నారు. అదేవిధంగా నీటిని తాగేందుకు వచ్చిన జంతువుల కోసం ఉప్పు ముద్దలను ఏర్పాటు చేస్తున్నారు. ఉప్పు ముద్దను నాకడంతో వడదెబ్బ బారి నుంచి కాపాడుకునే అవకాశం ఉందని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. నల్లమల అభయారణ్యంలో వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యే క కృషి చేస్తున్నట్లు ఎన్ఎస్‌టీఆర్ నంద్యాల ఎఫ్‌డీ బీఎన్ఎన్ మూర్తి తెలిపారు. వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం రూ.3 లక్షలు వెచ్చిస్తోందని చెప్పారు.

మహానంది పండితుడికి రాష్ట్రస్థాయి పురస్కారం



కమిషనర్ సత్యనారాయణ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న నాగేశ్వరశర్మ

మహానంది: మహానంది ఆలయ వేదపండితులు నౌడూరి వెంకట దుర్గా నాగేశ్వరశర్మకు రాష్ట్రస్థాయి ఉగాది పురస్కారం దక్కింది. మంగళవారం దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ, సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శిల ఆధ్వర్యంలో విజయవాడలో పురస్కారం అందుకున్నారు. ఈ మేరకు అవార్డుకు ఎంపికైన నాగేశ్వరశర్మను ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు, రుగ్వేదం వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని, ఉద్యోగులు అభినందించారు.

ఓటరూ.. తెలుసుకో!

- ఓటు హక్కు లేకపోతే ఫారం–6 ద్వారా దరఖాస్తు
- ఓటుకు ఫోన్ నంబర్ అనుసంధానం



నంద్యాల(అర్బన్): సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి పౌరుడూ తన ఓటు హక్కును వినియోగించుకునేందుకు సిద్ధమయ్యాడు. ఇలాంటి తరుణంలో ఓటరు జాబితాలో తన పేరు ఉందో? లేదో? అనే ఆత్రుత అందరిలోనూ నెలకొని ఉంటుంది. ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకున్న భారత ఎన్నికల కమిషన్ జాబితాలో ఓటు వివరాలు ముందే తెలుసుకునే సదవకాశాన్ని కల్పించింది. జాబితాలో ఓటు లేదని గుర్తిస్తే వెంటనే ఫారం–6 ద్వారా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించింది. కొత్తగా ఓటరు నమోదుకు ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ముగిసే ఏప్రిల్ 25వ తేదీ వరకు అవకాశం కల్పించారు. ప్రస్తుత ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునేలా అనుబంధ జాబితాలో చేరుస్తారు.

అందుబాటులో ఓటర్ హెల్ప్ లైన్..

☛ ఓటరు జాబితాలను పోలింగ్ కేంద్రాల పరిధిలోని బూత్ లెవల్ అధికారి (బీఎల్‌ఓ), తహసీల్దారు కార్యాలయంలో ఇప్పటికే అధికారులు అందుబాటులో ఉంచారు. ఆయా అధికారిక కార్యాలయాలకు వెళ్లి జాబితాను పరిశీలించి, ఓటు హక్కు ఉందో... లేదో నిర్ధారించుకోవచ్చు. అలా కాకపోతే ఆన్‌లైన్‌లో చూసుకునే అవకాశాన్ని కూడా భారత ఎన్నికల కమిషన్ కల్పించింది. ఇందు కోసం ప్రత్యేకంగా ఓటర్ హెల్ప్ లైన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది.

☛ స్మార్ట్ ఫోన్లలో ఓటర్ హెల్ప్‌లైన్ యాప్‌'ను ఇన్స్టాల్ చేసుకోవడం ద్వారా ఓటరు వివరాలు తెలుసుకోవచ్చు. ఈ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. యాప్ ఓపెన్ చేయగానే ఆప్షన్లు వస్తాయి. సెర్చ్ యువర్ నేమ్ ఇన్ ఎలక్టోరల్ 'రోల్' అని కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేస్తే 'సెర్చ్‌బై' కింద వచ్చిన ఆప్షన్లలో 'ఎపిక్ నంబర్' ద్వారా ఓటు వివరాలు తెలుసుకోవచ్చు.

☛ కంప్యూటర్ ద్వారా ఓటర్ వివరాలు తెలుసుకునే https:// electoralsearch. eci. gov. in వెబ్‌సైట్ ఓపెన్ చేయాలి. అందులో సెర్చ్‌బై ఎపిక్ నంబర్ అనే ఆప్షన్‌పై క్లిక్ చేసి, ఓటర్ ఐడీ నంబర్, స్టేట్ అనే చోట ఆంధ్రప్రదేశ్ అని సెలెక్ట్ చేసుకోవాలి. క్యాప్చర్ కోడ్ ఎంటర్ చేసి సెర్చ్ ఆప్షన్‌ను క్లిక్ చేయగానే ఓటు వివరాలు కనిపిస్తాయి.

ఓటు వివరాలు తెలుసుకునేందుకు..

1950 టోల్ ఫ్రీ నంబర్‌ను సైతం ఎన్నికల కమిషన్ అందుబాటులో ఉంచింది. ఈ నంబర్‌కు ఫోన్ చేసి ఓటర్ ఐడీ నంబర్ చెబితే అక్కడి సిబ్బంది ఆన్‌లైన్‌లో పరిశీలించి ఓటు ఉందా లేదా అనే విషయం చెబుతారు.

ఓటు లేకపోతే నమోదు చేసుకోవాలి..

ఓటు లేదని తెలిస్తే వెంటనే ఓటరుగా నమోదుకు ఫారం–6 ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. బీఎస్‌ఓ, తహసీల్దారు కార్యాలయంలో మాన్యువల్‌గా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లోనూ ఓటరుగా నమోదు చేసుకునే వెసులుబాటు ఉంది.

ఫోన్ నంబర్‌తో అనుసంధానం ఇలా...

ఓటును మీ మొబైల్ ఫోన్ నంబర్‌కు అనుసంధానం చేసుకోవడం ద్వారా చాలా ప్రయోజనాలు ఉంటాయి. ఎవరైనా మీ ఓటును సవరించాలనో, తొలగించాలనో చూస్తే వెంటనే అనుసంధానం చేసుకున్న నంబర్‌కు సంక్షిప్త సమాచారం అందుతుంది. ఈ సౌలభ్యం పొందేందుకు వెబ్‌లింక్‌ను ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. http:// ceoaperms. ap. gov.in/ AP& MobileNo Registration/ Mobile No Registration. aspx లింక్‌కు తెరిచి, ఇందులో ఓటరు ఐడీ నంబర్ ఎంటర్ చేయాలి. దాని కిందనే ఫోన్ నంబర్ ఎంటర్ చేసి రిజిస్టర్ ఆప్షన్‌ను క్లిక్ చేయాలి. వెంటనే ఫోన్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది. దానిని ఎంటర్ చేసిన తర్వాత ఓటర్ ఐడీకి ఫోన్ నంబర్ అనుసంధానమవుతుంది.

చౌడేశ్వరిదేవి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

బనగానపల్లె రూరల్: నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి రాయబారాది బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ముందుగా గణపతి, పుణ్యాహ వాచన, అంకురార్పణ పూజలు నిర్వహించారు. సాయంత్రం గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి మహిళలు బోనాలతో ప్రదర్శనగా వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. అలాగే రైతులు తమ ఎడ్ల బండిపై అమ్మవారి నైవేద్యం పెట్టుకుని ఆలయం చుట్టూ పన్నేరు బండ్లు తిప్పి ప్రాకార రథోత్సవాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. భక్తుల కోసం రాత్రి పౌరాణిక నాటకాన్ని ప్రదర్శించారు. బనగానపల్లె ఎస్ఐ రామిరెడ్డి, కుటుంబ సభ్యులతో చౌడేశ్వరిదేవి అమ్మవారిని దర్శించుకున్నారు.



ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరిదేవి అమ్మవారు



అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు ప్రదర్శనగా వస్తున్న భక్తులు






బేతంచెర్లలో సుంకులాపరమేశ్వరి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు, అలంకరణలో అమ్మవారు, డోన్ మండలం వెంకటాపురంలో మారెమ్మకు పూజలు చేస్తున్న భక్తులు, మద్దికెరలో రంగులు చల్లుకుని వేడుకలు చేసుకుంటున్న దృశ్యం

ఊరూరా ఉగాది సంబరం



కర్నూలులోని లలితా పీఠంలో ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు మంగళవారం అంబరాన్నంటాయి. మహిళలు ఉదయమే స్నానాలాచరించి, ఇళ్ల ముందు ముగ్గులతో అలంకరించారు. ఉగాది పచ్చడి, పిండి వంటలు చేసుకుని కుటుంబ సమేతంగా ఆలయాలకు చేరుకుని ఇష్టదైవాలకు నైవేద్యంగా సమర్పించారు. గ్రామ దేవతలకు కాయకర్పూరాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయాల్లో పురోహితులు పంచాంగ పఠనం చేశారు. ప్రజలు తమ పేర్ల బలం ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. రైతులు ఉదయమే తమ ఎద్లను అలంకరించి కాడితో పొలాలకు వెళ్లి సేద్యాన్ని ప్రారంభించారు. యువకులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుని ఆనందించారు. పరుగు, రాతి గుండు ఎత్తడాలు తదితర పోటీలతో తెలుగు వారి మొదటి పండుగను సంబరంగా చేసుకున్నారు.



లింగమయ్య స్వామి ఆలయం వద్ద రథాన్ని లాగుతున్న పొట్టేళ్లు



హొళగుంద: గజ్జహళ్లలో రాతిగుండు ఎత్తిన యువకుడు






తుగ్గలిలో వ్యవసాయ పనులు ప్రారంభిస్తున్న రైతు



గోనెగండ్లలో పూర్ణకుంభాలతో వెళ్తున్న మహిళలు, నంద్యాలలో దర్శనమిస్తున్న సుంకులా పరమేశ్వరి, పాములపాడులో ఎద్దుల కాడితో రైతన్న, రుద్రవరంలో పరుగు పోటీలో యువకులు, రంగులు చల్లుకుంటున్న యువతీ యువకులు

క్లుప్తంగా

రైలు నుంచి జారిపడి యువకుడి దుర్మరణం



మృతుని వద్ద లభించిన ఆధార్ కార్డు

ఆదోని సెంట్రల్: రైలు నుంచి జారి పడి ఓ యువకుడు దుర్మరణం చెందిన ఘటన మండల పరిధిలోని కుప్పగల్–కోసిగి ఆర్ఎస్‌ల మధ్య కిలోమీటర్ నంబర్ 520/11–09 వద్ద మంగళవారం చోటుచేసుకుంది. రైల్వే ఎస్ఐ గోపాల్ తెలిపిన వివరాలు.. బిహార్ రాష్ట్రం జసొలై పోస్ట్, కోయ్ రాగవ గ్రామానికి చెందిన తునిలాల్ మాంజి(25) బెంగళూరు నుంచి న్యూఢిల్లీ వెళ్లే రైల్‌లో జనరల్ టికెట్‌తో ప్రయాణం చేస్తూ కుప్పగల్–కోసిగి ఆర్ఎస్ మధ్యలో జారీ పడ్డాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు.

స్థానికుల సమాచారంతో రైల్వే పోలీసులు అక్కడికి వెళ్లి పరిశీలించారు. మృతుడి వద్ద ఉన్న ఆధార్ కార్డు, టికెట్ ఆధారంగా బిహార్ యువకుడిగా గుర్తించి అక్కడి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ తెలిపారు.

ఆస్తి పంపకాల్లో ఘర్షణ

- తండ్రిపై దాడి చేసిన కుమారుడు
- గాయపడిన తండ్రి కోలుకోలేక మృతి



మృతి చెందిన వృద్ధుడు అయ్యన్న

మిడుతూరు: ఆస్తి పంపకాల్లో చోటు చేసుకున్న ఘర్షణలో ఓ తండ్రి మృతి చెందాడు. ఈ విషాద ఘటన తలముడిపి గ్రామంలో చోటు చేసుకుంది. మిడుతూరు ఎస్ఐ జగన్‌మోహన్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కురవ అయ్యన్న (85)కు బాలన్న, శ్రీనివాసులు ఇద్దరు కుమారులు. ఇంటి పంపకం విషయంలో సోమవారం రాత్రి తండ్రి కుమారుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో చిన్న కుమారుడు శ్రీనివాసులు ఆగ్రహంతో తండ్రి అయ్యన్నపై కర్రతో దాడి చేశాడు. తలపై తీవ్ర గాయమైన వృద్ధుడిని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా కోలుకోలేక మృతి చెందాడు. పెద్ద కుమారుడు బాలన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆటో బోల్తా పడి వ్యక్తి దుర్మరణం



మృతి చెందిన చుక్కా మోహన్

కోవెలకుంట్ల: ఉగాది పండుగ పూట కోవెలకుంట్ల పట్టణంలో విషాదం చోటు చేసుకుంది. మంగళవారం ఆటో బోల్తా పడిన సంఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఎస్ఐ వరప్రసాద్ అందించిన సమాచారం మేరకు.. పట్టణ శివారులోని స్వామినగర్ కాలనీకి చెందిన చుక్కా మోహన్ (49), కంపమల్ల జయన్న, చుక్కా రాజు, రామకృష్ణలు మండలంలోని అమడాల నుంచి ఆటోలో దున్నపోతును ఎక్కించుకుని కోవెలకుంట్లకు బయలు దేరారు. పట్టణంలోని రంగరాజు పేటలోని పాత ఎస్సీ హాస్టల్ సమీపంలో దున్నపోతు బెదిరి కట్లు తెంచుకుని ఆటోలో నుంచి దూకి పారిపోయింది. ఈ క్రమంలో ఆటో అదుపు తప్పి బోల్తా పడటంతో ఆటో నడుపుతున్న మోహన్ అక్కడికక్కడే మృతి చెందగా మిగిలిన ముగ్గురు గాయపడ్డారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో గాయపడిన వ్యక్తులను చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేర్పించారు. మృతునికి భార్య నాగమునెమ్మ, కుమారులు నాగరాజు, సందీప్, కుమార్తె సంధ్య ఉన్నారు. పండుగ రోజున ప్రమాదం చోటు చేసుకుని కాలనీకి చెందిన ఓ వ్యక్తి మృతి చెందటంతో ఆ కుటుంబంతో పాటు స్వామినగర్ కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

సంప్రదాయ సంబరం

- చౌడేశ్వరి దేవి ఆలయం చుట్టూ ఎడ్ల బండ్ల ప్రదక్షిణ




ఎడ్ల బండ్ల ర్యాలీని ప్రారంభిస్తున్న ఎంపీ పోచా, ఎమ్మెల్యే కాటసాని, ఆలయం చుట్టూ ఎడ్ల బండ్ల ప్రదర్శన

కల్లూరు: కర్నూలు నగరంలోని కల్లూరులో వెలసిన చౌడేశ్వరి దేవి ఆలయంలో సంప్రదాయ సంబరం కొనసాగింది. ఉగాదిని పురస్కరించుకునే మంగళవారం అమ్మవారి ఆలయం చుట్టూ ఎడ్ల బండ్ల ప్రదక్షిణ నిర్వహించారు. నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఆయన తనయుడు శివనరసింహారెడ్డి హాజరై ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కల్లూరు ఊరు వాకిలి వద్ద ఎడ్ల బండ్ల ఊరేగింపును ప్రారంభించారు. యువత కేరింతలు, సంబరాలతో ఎడ్ల బండ్ల ఊరేగింపు ఆలయం వద్దకు చేరుకుంది. ఆలయం చుట్టూ బురదలో వృషభాల ప్రదక్షిణ చేశారు. ఉత్సవాలను తిలకించడానికి కర్నూలు నగరంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో పాలిశెట్టి రాజ్‌కుమార్, తొగట వీర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పాలిశెట్టి తులసి పాల్గొన్నారు.

ఇంగ్లిష్ స్పీకింగ్‌లో ఉచిత శిక్షణ

- 'మేధా ఇన్‌స్టిట్యూట్' ఫౌండర్ చిరంజీవి వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సర్కారీ స్కూళ్లలో ప్రాథమిక విద్య నుంచీ ఇంగ్లీషు మీడియాన్ని అందుబాటులోకి తేవటం ప్రశంసనీయమని 'మేధా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్' వ్యవస్థాపకుడు, చీఫ్ కోచ్ డాక్టర్ ఎ.చిరంజీవి అభిప్రాయపడ్డారు. విద్య, ఉద్యోగం, వ్యాపారం.. ఇలా ఏ రంగంలోనైనా ఇంగ్లిష్‌పై పట్టున్న వారికే అవకాశాలు మెరుగ్గా ఉంటున్నాయని చెబుతూ.... ఆసక్తి ఉన్నవారి కోసం తమ సంస్థ ఉచితంగా ఇంగ్లీషు స్పీకింగ్ కోర్సును అందించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలియజేశారు. ''మా ఇన్‌స్టిట్యూట్‌ను ఏర్పాటు చేసి 30 సంవత్సరాలవుతున్న సందర్భంగా ఈజీ ఇంగ్లీష్ కార్యక్రమాన్ని తలపెట్టాం. ఆన్‌లైన్లో ఉచితంగా అందజేస్తాం'' అని చెప్పారాయన. ఈజీ ఇంగ్లీష్ ద్వారా స్పోకెన్ ఇంగ్లీష్ మాత్రమే కాకుండా దాదాపు 9 రకాల అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలియజేశారు. ఈ నెల రెండో వారం నుంచి తరగతులు ప్రారంభిస్తామన్నారు. ''ఈ కోర్సుకు ఆసక్తి ఉన్న ఎవరైనా రిజిస్టర్ చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ కోసం దిగువ ఇచ్చిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసుకుంటే చాలు. వారి మొబైల్‌కు రిజిస్ట్రేషన్ లింకు వస్తుంది. లేనిపక్షంలో 9866006662 ఫోన్ నంబర్‌కు వాట్సాప్ ద్వారా వివరాలు పంపినా వారి మొబైల్ ఫోన్‌కు లింకును పంపిస్తాం'' అని వివరించారు. అభ్యర్థుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈ నెల 12వ తేదీ వరకు కొనసాగుతుందని, ఆ తర్వాత తరగతులు ప్రారంభిస్తామని చెప్పారు.

నేడు ప్రేమికుల పిడకల సమరం

- కైరుప్పలలో కొనసాగుతున్న ఆచారం
- తరలిరానున్న భక్తులు




అలంకరణలో వీరభద్ర స్వామి, కాళికాదేవి

ఆస్పరి: మండలంలోని కైరుప్పలలో వెలసిన వీరభద్రస్వామి, కాళికాదేవి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం పిడకల(పెద్ద నుగ్గులాట) సమరం జరగనుంది. ఈ పిడకల సమరాన్ని చూడడానికి ఆస్పరి, కారుమంచి, బిల్లేకల్, చెన్నపల్లి, పుప్పాలదొడ్డి, యాటకల్, కల్లపరి, దొడగొండ, తురువగల్, అలారుదిన్నె, ముత్తుకూరు తదితర గ్రామాల నుంచే కాక కర్ణాటక, తెలంగాణ, తదితర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు హాజరుకానున్నారు.

మొక్కుబడిగా పిడకల సమర్పణ

కోరిన కోరికలు నెరవేరితే భక్తులు నగలు, పట్టు వస్త్రాలు, కానుకలు సమర్పించడం సర్వసాధారణం. కైరుప్పల గ్రామంలో అందుకు విరుద్ధంగా భక్తులు వీరభద్రస్వామికి పిడకలు సమర్పించి మొక్కుబడి తీర్చుకుంటారు. స్వామివారి సన్నిధిలో బుధవారం జరిగే పిడకల సమరానికి నుగ్గులు సిద్ధం చేస్తారు. మొక్కుబడి ఉన్న భక్తులు వారికి తోచిన విధంగా పిడకలను ఆలయ ఆవరణలో రాశులుగా పోసి మొక్కుబడి తీర్చుకుంటారు.

సమరం సాగుతుంది ఇలా ..

పుప్పాలదొడ్డి, చెన్నంపల్లి, అలారుదిన్నె, వెంగళాయదొడ్డి, కారుమంచి, కల్లపరి తదితర గ్రామాల ప్రజలు తమ కోరికలను తీర్చిన వీరభద్రుడికి మొక్కుబడి సమర్పించేందుకు నెల నుంచి తమ ఇంటిలో ఉన్న పశువుల పేడతో పిడకలు తయారు చేస్తారు. వాటిని ఉగాది మరుసటి రోజు దేవుడి సన్నిధికి చేరుస్తారు. పిడకల సమరానికి ముందు భక్తులు రెండు వర్గాలుగా విడిపోయి పిడకలతో కొట్టుకుంటారు. దెబ్బలు తగలకుండా టవాళ్లతో ముసుగు తొడుక్కుంటారు. అరగంట పాటు జరిగే పిడకల సమరంలో చాలా మంది భక్తులు గాయపడతారు. గాయానికి స్వామివారి బండారం రాసుకుని ఇంటి ముఖం పడతారు.

కారుమంచి పెద్దరెడ్డి వంశస్తుల ఆచారం

స్వామి ఉత్సవాల్లో కారుమంచి గ్రామానికి చెందిన పెద్దరెడ్డి వంశస్తులు రాచరికాన్ని గుర్తుకు తెస్తున్నారు. ఆ వంశస్తుల్లో ఒకరు పిడకల సమరం రోజు కిరీటం ధరించి ఖడ్గం చేతబూని తళుకులీనే షేర్వాణి దుస్తుల్లో కారుమంచి నుంచి అశ్వంపై కైరుప్పల గ్రామానికి తన అనుచరులతో చేరుకుంటారు. అనంతరం వీరభద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి కారుమంచి వైపు వెళ్తాడు. తర్వాత పిడకల సమరం మొదలవుతుంది. పూర్వం కారుమంచి గ్రామానికి చెందిన పెద్దరెడ్డి వంశస్తులు ఆలయ అభివృద్ధికి కీలక పాత్ర పోషించడంతో ఇప్పటికీ ఆ కుటుంబానికి స్వామి ఉత్సవాల్లో ప్రత్యేక స్థానం కల్పిస్తున్నారు.

చారిత్రక నేపథ్యం

పిడకలు సమర్పించుకోవడానికి చారిత్రక నేపథ్యం ఉంది. విహార యాత్రకు వెళ్లిన వీరభద్రస్వామి తనకు తారస పడిన కాళికాదేవితో ప్రేమలో పడి వివాహం చేసుకుంటానని మాట ఇచ్చాడట. ఆ తర్వాత స్వామి ఇచ్చిన మాట తప్పడంతో కాళికాదేవి వర్గీయులకు తీవ్ర ఆగ్రహం కలిగించింది. వీరభద్ర స్వామిని అవమాన పరచాలని నిశ్చయించుకున్న కాళికాదేవి వర్గీయులు తమకు అందుబాటులో ఉన్న పిడకలతో స్వామితో పాటు ఆయన వర్గీయులపై దాడికి దిగారు. స్వామి వర్గీయులు కూడా పిడకలతో ఎదురు దాడికి దిగారు. ఇరువర్గాల మధ్య జరిగిన ఈ దాడి, ప్రతిదాడి రణరంగాన్ని తలపించింది. నిమ్న కులానికి చెందిన కాళికాదేవిని, అగ్రవర్ణానికి చెందిన వీరభద్రస్వామిని గ్రామపెద్దలు పంచాయతీ పెట్టి వారిద్దరికీ వివాహం చేశారని పెద్దలు చెబుతున్నారు. ప్రాణాలకు తెగించి పోరాడిన తమ వర్గీయులకు వీరభద్రస్వామి, కాళికాదేవి కోరిన కోరికలను తీర్చినట్లు పెద్దలు చెబుతున్నారు. వీరభద్రస్వామి, కాళికాదేవి ప్రేమ వ్యవహారం కారణంగా భక్తులు పిడకల సమరం చేసుకోవడం ఆచారంగా వస్తుంది.

పుప్పాలదొడ్డిలో చిన్న నుగ్గులాట

మండలంలోని కై రుప్పల వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం కై రుప్పల మజరా గ్రామం పుప్పాలదొడ్డిలో ఆనందోత్సవాల మధ్య చిన్న నుగ్గులాటను జరుపుకున్నారు. ఆచారం ప్రకారం మొదట పుప్పాలదొడ్డిలో వెలసిన గిడ్డాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామస్తులు రెండు వర్గాలుగా విడిపోయి నుగ్గులను ఒకరిపై ఒకరు విసురుకున్నారు. అంతకుముందు కై రుప్పల నుంచి వీరభద్రస్వామి, కాళికాదేవిల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో రెండు కిలో మీటర్ల దూరంలో ఉండే పుప్పాలదొడ్డికి తీసుకు వచ్చి గిడ్డాంజనేయ స్వామి ఆలయం ఆవరణలో పూజలు నిర్వహించారు. అనంతరం పుప్పాలదొడ్డి, పుటకలమర్రికి చెందిన గ్రామాల వారు ఒక వైపు.. కై రుప్పల, చెన్నంపల్లి, వెంగళాయిదొడ్డి, బిల్లేకల్లు తదితర గ్రామాల వారు ఒక వైపు నిలిచి సుమారు 20 నిమిషాలు పాటు ఒకరిపై ఒకరు నుగ్గులను విసురుకున్నారు.

కోలుకోలేక వివాహిత మృతి

కర్నూలు: భర్త రాముడు మరొకరితో తిరుగుతున్నాడని కలత చెంది భార్య దివ్య (25) రసాయన ద్రావణం తాగి అపస్మారక స్థితిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం మృతిచెందింది. వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన రాముడుతో కర్నూలుకు చెందిన దివ్యకు మూడేళ్ల క్రితం వివాహమైంది. భర్త కారు డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. వీరికి 11 నెలల కూతురు ఉంది. కొంతకాలంగా వేరే మహిళతో తిరుగుతుండటంతో మనస్థాపానికి గురై ఈనెల 6వ తేదీన భర్తతో గొడవ పడి రసాయన ద్రావణం తాగింది. వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించినా కోలుకోలేక మృతిచెందింది. తల్లి ఈశ్వరమ్మ ఫిర్యాదు మేరకు నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాయుధ బలగాల కవాతు

కర్నూలు : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కర్నూలు రెండో పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా ఆధ్వర్యంలో మంగళవారం సర్కిల్ పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాలు కొత్తపేట, ఐదు రోడ్ల కూడలి, ఎస్‌బీఐ సర్కిల్, గాంధీ నగర్, నరసింహారెడ్డి నగర్, లేబర్ కాలనీ, భగత్‌సింగ్ నగర్, వెంకటరమణ కాలనీ ప్రాంతాల్లో కేంద్ర సాయుధ బలగాలతో కలిసి స్థానిక పోలీసులు కవాతు నిర్వహించారు.

గ్యాస్ లీకై మంటలు

- ఇద్దరికి గాయాలు




వెల్దుర్తి సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న ప్రశాంతి, దుశ్యంత్

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి పట్టణంలోని ఓ ఇంట్లో వంట చేసేక్రమంలో సిలిండర్ రెగ్యులేటర్ ఊడి గ్యాస్ లీకై మంటలు రేగి ఇద్దరు గాయాలపాలయ్యారు. బాధితులు తెలిపిన వివరాలు.. 15వ వార్డులో నివాసం ఉంటున్న టీచర్ రెడ్డిపోగు వెంకట్రాముడు భార్య ప్రశాంతి మంగళవారం ఉదయం ఇంట్లో గ్యాస్‌స్టవ్‌పై వంట చేసేందుకు సిద్ధమైంది. స్టవ్ వెలిగిస్తుండగా రెగ్యులేటర్ ఊడి సిలిండర్ వద్ద మంట ఉవ్వెత్తున ఎగిసింది. తేరుకునేలోపే ప్రశాంతి ఒంటికి, నైటీకి మంటలంటుకున్నాయి. ఇంట్లోనే ఉన్న అల్లుడు దుశ్యంత్, ఇంటి చుట్టుపక్కల వారి సాయంతో ప్రశాంతిపై నీళ్లు పోసి మంటలను ఆర్పారు. ఈక్రమంలో దుశ్యంత్ స్వల్పంగా గాయపడ్డాడు. ఇద్దరినీ వెల్దుర్తి ఆసుపత్రికి తరలించగా స్టాఫ్ నర్స్ ప్రథమచికిత్స అందించారు. డ్యూటీ డాక్టర్లెవరూ లేకపోవడంతో తీవ్రంగా గాయపడిన మహిళను కర్నూలు ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు, గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని విచారించారు.


- ఇంటిని మైమరిపించిన వంటకాలు



ఉగాది పచ్చడి



భక్ష్యాలు



పులిహోర

కర్నూలు(అర్బన్): నగరంలోని సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నంబర్–1 కళాశాల బాలికల వసతి గృహంలో ఉగాది వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించుకున్నారు. వసతి గృహ గుమ్మానికి మామిడి తోరణాలు కట్టి, ప్రాంగణంలో రంగు రంగుల ముగ్గులతో అలంకరించారు. వసతి గృహ సంక్షేమాధికారిణి బెన్నమ్మ ఆధ్వర్యంలో వర్కర్లు ఉదయం నుంచే పరిసరాలను పరిశుభ్రంగా రూపొందించడంతో పాటు రుచికరమైన పదార్థాలను వండి విద్యార్థినులకు వడ్డించారు. ఉగాది పచ్చడితో పాటు భక్ష్యాలు, పులిహోర, పకోడి, అప్పడాలు, వంకాయ కూర, సాంబారు, వడియాలు, పెరుగన్నం, అరటి పండుతో ఇంటిని మైమరిపించే భోజనాలు వడ్డించారు. ఉదయం నుంచే ఈ సందర్భంగా హెచ్‌డబ్ల్యూఓ బెన్నమ్మ మాట్లాడుతూ డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, డిప్లమో విద్యార్థినులకు పరీక్షలు ఉన్నందున ఇళ్లకు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో ఇంటి వాతావరణంలో అందరూ భోజనం చేయాలనే ఉద్దేశంతో ఆహార పదార్థాలను చేయించామన్నారు. హెచ్‌డబ్ల్యూఓ బెన్నమ్మను సహాయ సంక్షేమాధికారి బి.మద్దిలేటి అభినందించారు.

'సంక్షేమం'లో ఘనంగా 'ఉగాది'



విద్యార్థినులకు ఆహార పదార్థాలను వడ్డిస్తున్న హెచ్‌డబ్ల్యూఓ బెన్నమ్మ








వంకాయ కూర వడియాలు పకోడి అప్పడాలు సాంబారు పెరుగన్నం